
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in


పోలీసుల పేరుతో బెదిరింపులు..







బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం



**అక్షరటుడే, బాల్కొండ:** లయన్స్ క్లబ్ బాల్కొండ ఆధ్వర్యంలో సోన్‌పేట్ గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు డయాబెటిక్ పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంసురేఖ ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, జిల్లా ఛైర్మన్ లింగం, యాదగిరి గౌడ్, మల్లేశ్, నర్సయ్య, బరకం రాములు, రాజశేఖర్, రమేశ్, సోన్‌పేట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.





## నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** గ్రామ పంచాయతీ నామినేషన్ల ప్రక్రియ గురువారం మొదలైంది. మొదటి విడతలో భాగంగా బోధన్ నియోజవర్గంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. కాగా.. నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బినోల గ్రామ పంచాయతీలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియను గురించి తెలుసుకున్నారు. నామినేషన్ సెంటర్‌కు 100 మీటర్లలోపు నిషేధిత ఉత్తర్వులు అమల్లో ఉంటాయన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎస్సైలు తిరుపతి, యాదగిరి గౌడ్, ప్రొసీడింగ్ ఆఫీసర్ కె.అనిత, సిబ్బంది ఉన్నారు.



## ఎన్నికల ప్రక్రియను భంగపరిస్తే కఠిన చర్యలు

**అక్షరటుడే, కామారెడ్డి :** ఎన్నికల్లో శాంతి భద్రతలను కాపాడడంలో ఎలాంటి రాజీ ఉండదని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. ఎన్నికల ప్రక్రియను భంగపరచాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల దృష్ట్యా గురువారం రామారెడ్డి మండలంలోని పోసానిపేట్, రామారెడ్డి గ్రామ పంచాయతీలు, మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాచారెడ్డి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల్లో విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడి, ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్ ప్రక్రియ పూర్తిగా నిష్పక్షపాతంగా, శాంతియుతంగా జరిగేలా పనిచేయాలని సూచించారు. అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీ వెంట కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఎస్సైలు ఉన్నారు.




## మానవమేధస్సుకు ఏఐ సహాయకారి..: వీసీ

**అక్షరటుడే, ఇందూరు:** మానవమేధస్సుకు ఏఐ సహాయం చేసే పరికరమని తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరిరావు అన్నారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధ యుగంలో విజ్ఞాన శాస్త్రాలకు ఉన్న అవకాశాలు.. అవరోధాలు' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ మేధస్సుకు సాటి ఏదీ రాదన్నారు. ఏఐని విచక్షణతో మాత్రమే వాడుకోవాలన్నారు. అనంతరం సదస్సుకు సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాకతీయ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ సాయన్న, ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కరుణసాగర్, హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ సూర్యనారాయణ, వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ శ్యాం, సమన్వయకర్తలు రామకృష్ణ, భరత్ రాజ్, కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



# తొలిదశ ఎన్నికలకు సన్నద్ధం..

పల్లెల్లో ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు సిద్ధం కావడం, ఆ వెంటనే ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై నెలకొన్న అనుమానాలకు తెరపడింది. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనుండగా.. మొదటి విడత నామినేషన్ల పర్వం మొదలైంది. రిజర్వేషన్ ప్రకారం ఆశావహులు పోటీకి మద్దతు కోసం నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రాజకీయ పార్టీలు సైతం గెలిచే అభ్యర్థులను బరిలోకి దింపే యోచనలో ఉన్నాయి. చివరి రోజు నామినేషన్ల జోరు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

- అక్షరటుడే, కామారెడ్డి

■ ఉమ్మడి జిల్లాలో మొదలైన నామినేషన్ల పర్వం

■ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థుల పాట్లు ■ మేజర్ జీపీలపై ఫోకస్

ఉమ్మడి జిల్లాలో మొదటి విడత ఎన్నికలకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే అధికారుల నియామకం, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి. కామారెడ్డి జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికలు భిక్కనూర్, బీబీపేట, దోమకొండ, కామారెడ్డి, మాచారెడ్డి, పాల్వంచ, రాజంపేట, రామారెడ్డి, సదాశివనగర్, తాడ్వాయి మండలాల్లో జరగనున్నాయి. మొత్తం 167 గ్రామ పంచాయతీల్లో 1,520 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడత ఎన్నికల కోసం 1,533 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2032 పోలింగ్ అధికారులు, 2,034 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. జిల్లాలో 153 క్రిటికల్, 164 సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. ఈ కేంద్రాల్లో భారీ బందోబస్తు నిర్వహించనున్నారు.

### నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్ జిల్లాలో మొదటి విడత ఎన్నికలు బోధన్ డివిజన్‌లోని బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పోతంగల్, రెంజల్, రుద్రూర్, సాలురా, వర్ని, ఎడపల్లి, నవీపేట్ మండలాల్లో నిర్వహించనున్నారు. మొత్తం 11 మండలాల్లో 184 గ్రామ పంచాయతీలు, 1,642 వార్డు స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం 1,653 పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేశారు.

### అభ్యర్థుల పాట్లు

నామినేషన్ల పర్వం మొదలు కావడంతో సర్పంచ్‌గా పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ తరఫున తానే నిలబడతానని గెలిపిస్తే ఏ పనులు చేసేది ఓటర్లకు వివరిస్తున్నారు. గతంలో సర్పంచ్‌గా పోటీ చేసిన అభ్యర్థులు సైతం ఈసారి కూడా పోటీలో ఉండటంతో ఓటర్లు ఆలోచిస్తున్నారు. వారి హయాంలో జరిగిన అభివృద్ధిని ఓటర్లకు వివరిస్తున్నారు. మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొంటున్నారు.

### పార్టీల ఫోకస్

మేజర్ జీపీల్లో గెలుపు కోసం ఆయా పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. ఆయా గ్రామాల్లో వచ్చే ఆదాయం కూడా దృష్టిలో ఉంచుకుని ఎక్కువ మంది పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. కామారెడ్డి జిల్లాలో చిన్నమల్లారెడ్డి, రామా రెడ్డి, తాడ్వాయి, మాచారెడ్డి, గజ్యా నాయక్ తండా, భిక్క నూరు, పెద్ద మల్లారెడ్డి, బస్వాపూర్, పాల్వంచ, రాజంపేట, బీబీపేట, జనగామ, దోమకొండ, సదాశివనగర్, అడ్లూర్ ఎల్లారెడ్డి, పద్మాజీవాడి గ్రామాలపై ఫోకస్ చేసే అవకాశాలున్నాయి. ఎన్నికలను ఆయా పార్టీలు సవాల్‌గా తీసుకున్నాయి. మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నాయి.

### 30 వరకు నామినేషన్ల స్వీకరణ

మొదటి విడత ఎన్నికలలో గురువారం నుంచి నామినేషన్లు మొదలయ్యాయి. ఆదివారం వరకు నామినేషన్లు కొనసాగనున్నాయి. ప్రధాన పార్టీల మద్దతుతో బరిలో నిలబడే అభ్యర్థులు నాయకుల నుంచి హామీ తీసుకునే పనిలో పడ్డారు. చివరి రోజు వరకు పార్టీ నుంచి అభ్యర్థులు ఎవరు అనేది సస్పెన్స్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. నామినేషన్లు చివరి రోజు పెరిగే అవకాశాలు ఉన్నాయి.



## జిల్లా కలెక్టర్‌తో ఎన్నికల అబ్జర్వర్ భేటీ

**అక్షరటుడే, ఇందూరు:** గ్రామపంచాయతీ ఎన్నికలకు జిల్లా అబ్జర్వర్‌గా నియమితులైన వెనకబడిన తరగతుల సంక్షేమ పాఠశాలల ప్రత్యేక అధికారి శ్యాం ప్రసాద్ లాల్ గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో భేటీ అయ్యారు. జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్ల గురించి వివరించారు. ఎన్నికలకు సంబంధించి జనరల్ అబ్జర్వర్‌కు ఫిర్యాదులు, సూచనలు చేయదలచిన వారు 6309505554 నంబరును సంప్రదించాలన్నారు. అలాగే observergpelec.nzb@gmail.comకు కూడా మెయిల్ చేయవచ్చని పరిశీలకులు శ్యాంప్రసాద్ తెలిపారు.

## ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: గంప గోవర్ధన్



**అక్షరటుడే, కామారెడ్డి:** మొదటి విడత జరిగే సర్పంచ్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నాయకులకు సూచించారు. కామారెడ్డి పట్టణంలోని తన నివాసంలో గురువారం నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడుతూ ప్రచారం నిర్వహించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను ప్రజల ముందు పెడుతూ మద్దతు కూడా గట్టాలని సూచించారు. ఎక్కడ కూడా అశ్రద్ధ చేయకుండా గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు ప్రేమ్‌కుమార్, మినుకూరి రాంరెడ్డి, గోపి గౌడ్, మాచారెడ్డి మండలాధ్యక్షుడు బాలచంద్రం, మధుసూదన్ రావు, బల్వంత్ రావు పాల్గొన్నారు.

## కేంద్ర నిధుల కోసమే పంచాయతీ ఎన్నికలు: ఎంపీ అర్వింద్

**అక్షరటుడే, ఇందూరు :** కేంద్ర నిధుల కోసమే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలకు వెళ్తోందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ సింబల్ లేని ఎన్నికలు నిర్వహిస్తోందన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. ఆర్వోబీలకు సంబంధించి నిధులు విడుదల చేసినందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఎంపీ అర్వింద్ ధన్యవాదాలు తెలిపారు. మరో పది రోజుల్లో అడవి మామిడిపల్లి పనులు పూర్తవుతాయని, మాధవనగర్ వద్ద పనులు వేగం పుంజుకున్నాయని పేర్కొన్నారు. బోధన్‌లో రెండు పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్తశుద్ధితో దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా అర్సపల్లి ఆర్వోబీ కోసం భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. బీసీలకు ఫీజ్ రీయింబర్స్‌మెంటే ఇవ్వలేని రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఏం ఇస్తుందని ఎంపీ అర్వింద్ ఎద్దేవా చేశారు. ఇదంతా రాజకీయ డ్రామా అని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని 17శాతం మాత్రమే కేటాయించిందన్నారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, ప్రధాన కార్యదర్శులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, పోతనకర్ లక్ష్మీనారాయణ, న్యాలంరాజు పాల్గొన్నారు.




## ఏసీబీ వలలో మున్సిపల్ కమిషనర్

లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అనిశా అధికారులు



**అక్షరటుడే, ఆర్మూర్ :** మరో అవినీతి అధికారి ఏసీబీ వలకు చిక్కాడు. ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ఏ రాజు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అవినీతి అధికారులు మారడం లేదు. నిత్యం ఏసీబీ దాడులు చేపడుతున్నా భయపడడం లేదు. తమ వద్దకు వచ్చే ప్రజలను లంచాల పేరిట పట్టి పీడిస్తున్నారు. తాజాగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్, అతని డ్రైవర్ (ప్రైవేట్ వ్యక్తి)ని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పట్టణ పరిధిలో నిర్మించిన ఇంటికి నంబర్ కేటాయించడానికి మున్సిపల్ కమిషనర్ రాజు రూ.20 వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ తన డ్రైవర్ ద్వారా లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం డ్రైవర్ బ్యాగ్‌ను చెక్ చేయగా.. లెక్కల్లో చూపని రూ.4.30 లక్షల నగదు గుర్తించారు. ఆ డబ్బును స్వాధీనం చేసుకొని కమిషనర్‌తో పాటు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు.

## పలువురు సర్పంచుల ఏకగ్రీవ ఎన్నిక



**అక్షరటుడే, లింగంపేట :** లింగంపేట మండలం నల్లమడుగు పెద్దతండా పంచాయతీ పాలకవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా సంగీత మాన్‌సింగ్, ఉప సర్పంచ్‌గా శీలా మోహన్ ఎన్నికయ్యారు. పంచాయతీ అభివృద్ధి చెందాలని అందరం కలిసికట్టుగా పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తండావాసులు తెలిపారు.

### వర్ని మండలంలో..

**వర్ని:** మండలంలోని రెండు జీపీల్లో సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని గురువారం తీర్మానం చేశారు. సిద్ధాపూర్ సర్పంచ్‌గా బాల్ సింగ్, చెలక తండా సర్పంచ్‌గా గంగారాం మాత్రమే నామినేషన్లు దాఖలు చేయాలని గ్రామస్థులు తీర్మానాలు చేశారు.

## నాగమడుగు ఎత్తిపోతలకు నిధులివ్వాలి

**అక్షరటుడే, కామారెడ్డి :** నాగమడుగు ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఈ పథకం రూ. 430 కోట్లతో ప్రారంభమైందని.. ఇప్పటికి మూడో వంతు నిధులు కూడా ఇవ్వలేదన్నారు. వెంటనే పనులు పూర్తవడానికి నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె నిజాంసాగర్ మండలంలోని నాగమడుగు ఎత్తిపోతల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గానికి సాగు నీరు ఇచ్చే వ్యవస్థ చాలా తక్కువగా ఉందన్నారు. ఇక్కడ నిజాంసాగర్ ఉన్నప్పటికీ దాని ద్వారా జుక్కల్‌కు ప్రయోజనం లేని పరిస్థితి నెలకొందన్నారు. జుక్కల్‌లో చెరువుల ద్వారా 22 వేల ఎకరాలు, కౌలాస్ నాలా ద్వారా 9 వేల ఎకరాలు సాగు అవుతోందని తెలిపారు. మహారాష్ట్రతో పంచాయతీ కారణంగా లెండి ప్రాజెక్ట్ ఏళ్ల తరబడి పూర్తి కాకుండా ఉందన్నారు. జుక్కల్‌లో 40 వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలని నాగమడుగు లిఫ్ట్ ప్లాన్ చేశారని చెప్పారు. మంజీర నది నుంచి నీటిని ఎత్తిపోసుకోవాలని, అందుకోసం దాదాపు 2 వందల ఎకరాలపై పైగా భూ సేకరణ అవసరమన్నారు. అయితే పంప్ హౌస్‌కు కావాల్సిన 12 ఎకరాలు మాత్రమే సేకరించారని, కరకట్ట, చెక్ డ్యాం కోసం 200 ఎకరాల భూ సేకరణ అవసరమైతే గుంట కూడా సేకరించలేదన్నారు.



పైగా రాళ్లు అడ్డం పెట్టి నిర్మాణాలు మొదలు పెట్టారని తెలిపారు. ఫలితంగా ఇక్కడి మూడు గ్రామాల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా తమకు నీళ్లు రావని కూడా ఇక్కడి ప్రజలు భయపడుతున్నారన్నారు. ప్రభుత్వం దీనికి సంబంధించి పూర్తి వివరాలతో డీపీఆర్ ఉంచాలని, ఏయే గ్రామాలు ముంపునకు గురవుతాయో స్పష్టంగా చెప్పాల్సిన అవసరముందన్నారు. అంతకుముందు ఉన్న ప్రభుత్వం, ఈ ప్రభుత్వం కూడా డీపీఆర్ సిద్ధం చేయలేదని చెప్పారు. గత ప్రభుత్వంపై ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఈ పని చేయాలని సూచించారు.

## నామినేషన్ సెంటర్‌ను పరిశీలించిన సబ్ కలెక్టర్



**అక్షరటుడే, బోధన్:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో.. బోధన్ మండలంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో గురువారం పరిశీలించారు. పెంటాకుర్దు, సాలంపాడ్ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన కేంద్రాలను సందర్శించారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. డాక్యుమెంట్లను సరిగ్గా పరిశీలించాలని, రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.






## నామినేషన్ సెంటర్‌ను పరిశీలించిన బోధన్ ఏసీపీ

**అక్షరటుడే, బోధన్ :** బోధన్ మండలంలోని ఏరాజ్ పల్లి గ్రామంలో ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తును అయన పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నార న్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట రూరల్ సీఐ విజయ్ బాబు ఉన్నారు.

## ఆలూర్, కల్లెడిలో పోలింగ్ కేంద్రాల పరిశీలన



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కల్లెడి గ్రామ పంచాయతీలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను గురువారం ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో రాజలింగం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాల్సిన ప్రాథమిక సదుపాయాలు, భద్రతా అంశాలు, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో షెడ్లు, తాగునీటి ఏర్పాట్లు, విద్యుత్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. పోలింగ్ రోజు నిర్వహణలో ఎటువంటి లోపాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, హెడ్‌మాస్టర్ మురళి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఆర్మూర్ విద్యార్థుల ఎంపిక



**అక్షరటుడే, ఆర్మూర్:** రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఆర్మూర్ విద్యార్థులు ఎంపికయ్యారు. బోధన్‌లోని విజయ మేరీ హైస్కూల్‌లో ఈ నెల 24 నుంచి 25వరకు నిర్వహించిన డిస్ట్రిక్ట్ లెవెల్ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ఆర్మూర్ శ్రీ చంద్ర హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచిన్నట్లు పాఠశాల ఛైర్మన్ పోల్కం శేఖర్ తెలిపారు. పోటీల్లో పాఠశాల విద్యార్థులు వీక్షిత (8వ తరగతి), జి.మధురిమ (7వ తరగతి) 'గ్రీన్ ఎనర్జీ' థీమ్‌పై 'మేము హరిత శక్తిని సృష్టించి దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చుతాము" అనే శీర్షికతో ప్రాజెక్టును ప్రదర్శించి స్టేట్ లెవెల్ పోటికి ఎంపిక కావడం జరిగిందన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను కరస్పాడెంట్ పోల్కం నారాయణ, వైస్ ఛైర్మన్ పోల్కం శ్రీనివాస్, ప్రిన్సిపాల్ చాట్ల రవి, మార్గదర్శక ఉపాధ్యాయురాలు నిఖిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## విద్యార్థులకు ఉపన్యాస పోటీలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఇంగ్లీష్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కస్తూర్బా విద్యాలయాలకు చెందిన విద్యార్థులకు రాత పరీక్షతో పాటు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు మండల విద్యాధికారి రాజులు, స్థానిక బాలికల పాఠశాల హెచ్‌ఎం నర్సింలు, ప్రథమ, ద్వితీయ స్థానం పొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ ఫోరం ఎల్లారెడ్డి మండల శాఖ బాధ్యులు వెంకటరమణ, ఉపాధ్యాయులు రామకృష్ణ, రమేశ్, విఠల్, మాన్య, సృజన్, ప్రభాకర్, మాధవి, వనజ, అనిత తదితరులు పాల్గొన్నారు.

## కారు, బైక్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్ మండలం కోమలంచ గ్రామానికి చెందిన సూర్య ద్విచక్రవాహనంపై బోధన్ వైపు ప్రయాణిస్తుండగా.. ఎదురుగా అతివేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సూర్య కాలి వద్ద తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.



**సాహిత్య సేవలో సమాజానికి సేవ చేస్తున్నారు భీమ్‌గల్ పట్టణానికి చెందిన కవి కంకణాల రాజేశ్వర్. తన రచనలు, కార్యక్రమాల ద్వారా సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. విద్యార్థులకు సాహిత్యంపై అవగాహన కల్పించడం, సామాజిక స్పృహను పెంపొందించడం లాంటి కార్యక్రమాలు చేస్తున్నారు.**
**– అక్షరటుడే, ఆర్మూర్**

# సాహిత్య సాంస్కృతిక సేవలో కంకణాల రాజేశ్వర్..

▸ **కొరవి గోపరాజు సాహిత్య సాంస్కృతిక సంస్థ ఏర్పాటు**

భీమ్‌గల్ పట్టణంలో కొరవి గోపరాజు సాహిత్య సాంస్కృతిక సంస్థను కంకణాల రాజేశ్వర్ స్థాపించారు. ఈ సంస్థ ద్వారా ఆయన పలు సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. వివిధ పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు సాహిత్యంపై అవగాహన కల్పిస్తున్నారు. బాల కవి సమ్మేళనాల్ని నిర్వహించి బాలకవులకు అభినందన, ప్రశంసాపత్రాలు అందజేశారు. సాహిత్య కార్యాశాలల్ని నిర్వహిస్తున్నారు. తెలంగాణలోనే వినూత్న రీతిలో 'జమ్మి చెట్టు కింద కవి సమ్మేళనం' శీర్షికతో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ప్రముఖుల ప్రశంసలు పొందారు.

### అష్టావధానాలు..

కవికంకణాల రాజేశ్వర్ పలుమార్లు అష్టావధానాల్ని నిర్వహించారు. ప్రముఖ అష్టావధాని డాక్టర్ గణపతి అశోక్ శర్మ (నిజామాబాద్), మధురకవి, అష్టావధాని డాక్టర్ బెజుగామ రామమూర్తి శర్మతో అష్టావధానాల్ని ఏర్పాటు చేశారు. శ్రీ సరస్వతి శిశు మందిర్, కృష్ణవేణి హైస్కూల్, శారదాశ్రమం హైస్కూల్ (భీమ్‌గల్), క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల (చేపూర్) మొదలైన విద్యాసంస్థలలో తన సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల్లో సాహిత్యంపై మక్కువ పెంచేలా కృషి చేస్తున్నారు.

### సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ సహకారంతో..

ఉగాది వేడుకల్ని సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ భీమ్‌గల్ సౌజన్యంతో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాల్ని వైభవంగా నిర్వహించారు. అనేక రంగాల వారిని ప్రోత్సహించి వెలుగులోకి తెచ్చారు. ఉత్తమ వినాయక మండపాల నిర్వాహకులను, ఉత్తమ బతుకమ్మలు చేసిన మహిళలను గౌరవించి ఘన సన్మానాలు చేశారు. స్థానిక భీమ్‌గల్ సీఐ, ఎస్సైలతో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ తొలి తెలుగు కథాకావ్య రచయిత కొరవి గోపరాజు పేర సంస్థను ఏర్పాటు చేసి ఆయన సేవలందిస్తున్నారు.

## పీడీఎస్ బియ్యం వేలంపాట



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి తహశీల్దార్ కార్యాలయంలో పీడీఎస్ బియ్యం వేలంపాట నిర్వహించారు. ఇటీవల 13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా కేసులు నమోదు చేసి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బియ్యం వేలం వేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. కాగా.. గురువారం తహశీల్దార్ ప్రేమ్ కుమార్, నాయబ్ తహశీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో వేలంపాట నిర్వహించారు.

## ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లు సీజ్



**అక్షరటుడే, మెండోరా:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. వెల్గటూర్ పెద్దవాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను మెండోరా పోలీసులు పట్టుకున్నారు. ఉదయం 7 గంటలకు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై సుహాసిని ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఆపారు. ఎలాంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి.. వాటిని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ట్రాక్టర్ యజమానులు అల్లెపు లింబాద్రి, పెనుగొండ శ్రీనివాస్, వేముల రామరాజు, ఓర్సు శ్రీనివాస్‌పై కేసులు పెట్టారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.



## పైప్‌లైన్ పనులను పరిశీలించిన ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్

**అక్షరటుడే, బాన్సువాడ :** బాన్సువాడ పట్టణ పరిధిలో చింతల్‌నాగారం నుంచి ఫిల్టర్ బెడ్ వరకు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న మెటల్ రోడ్ పనులకు గురువారం అగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల బాలరాజ్ భూమిపూజ చేశారు. అనంతరం అమృత్ 2.0 పథకంలో భాగంగా పట్టణంలో కొనసాగుతున్న తాగునీటి పైపులైన్ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ ఛైర్మన్ గంగాధర్, సొసైటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, జిల్లా యువజన అధ్యక్షుడు మధుసూదన్, దాసరి శ్రీను, గౌస్ తదితరులున్నారు.

## పోలీసుల పేరుతో బెదిరింపులు.. ముగ్గురి అరెస్ట్




**అక్షరటుడే, కామారెడ్డి :** పోలీసులమని బెదిరించి వసూళ్లకు పాల్పడిన ముగ్గురిని దేవునిపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేట మండల కేంద్రానికి చెందిన జింక భాస్కర్ అతని స్నేహితులు నవీన్ గౌడ్, లక్ష్మణ్‌తో కలిసి చిన్న మల్లారెడ్డి శివారులోని ఎల్లమ్మ దేవాలయం వద్ద పోలీసులమని చెప్పి ఒక వ్యక్తి నుంచి రూ.1,800, ఒక మొబైల్ ఫోన్‌ను బెదిరించి బలవంతంగా లాక్కున్నారు. దాంతో బాధితుడు దేవునిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల విచారణలో రాజాంపేటకు చెందిన భాస్కర్, నవీన్ గౌడ్, లక్ష్మణ్ పోలీసుల పేరుతో బెదిరించినట్లు తేలింది. గురువారం సాయంత్రం సరంపల్లి ఎక్స్ రోడ్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న తెల్ల రంగు హ్యుందాయ్ క్రెటా కారును ఆపారు. దీంతో డ్రైవర్ జింక భాస్కర్ పారిపోవడానికి ప్రయత్నించగా.. అతనితో పాటు లక్ష్మణ్‌ను కూడా పోలీసులు పట్టుకున్నారు. నవీన్ గౌడ్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. పట్టుబడిన నిందితుల నుంచి మొబైల్ ఫోను, కారు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజల భద్రతకు అప్రమత్తంగా ఉందన్నారు. ఎలాంటి అక్రమాలు, బెదిరింపులు, దోపిడీలు జరిగినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

## గ్రామీణ బ్యాంకులో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం

**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ గ్రామీణ బ్యాంకులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. నగరంలోని సుభాష్ నగర్ పరిధిలో ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు కార్యాలయంలో బుధవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. బ్యాంకు నుంచి మంటలు, పొగలు రావడాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఎగసి పడుతున్న మంటలను అదుపు చేశారు. బ్యాంకు కార్యాలయంలోని ఫర్నిచర్, కంప్యూటర్లు, లాప్‌టాప్‌లు అన్నీ కూడా అగ్నికి ఆహుతయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగినట్లు ఫైర్ సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారులు చేరుకుని నష్టాన్ని అంచనా వేశారు.



## తెయూ వీసీ, రిజిస్ట్రార్ తక్షణమే రాజీనామా చేయాలి



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ తక్షణమే రాజీనామా చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రాజుగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ విశ్వవిద్యాలయంలో జరిగిన అక్రమ నియామకాలను రద్దు చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పుపై యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. హైకోర్టు నుంచి వచ్చిన తీర్పును నిర్లక్ష్యం చేయడం చూస్తుంటే.. వీసీ, రిజిస్ట్రార్ అండదండలతోనే ఈ వ్యవహారం నడుస్తోందని స్పష్టమవుతోందన్నారు. తెయూలో అక్రమ నియామకాల రద్దుపై స్టే ఇవ్వడం అంటేనే యూనివర్సిటీ అధికారులకు చెంపపెట్టు లాంటిదన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ తక్షణం వీసీ, రిజిస్ట్రార్ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ నియామకాలపై చర్యలు తీసుకోకపోతే.. హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ వేస్తామని ఆయన హెచ్చరించారు.




## పీడీఎస్‌యూ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

**అక్షరటుడే, ఆర్మూర్ :** కామారెడ్డిలో నిర్వహించనున్న పీడీఎస్‌యూ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఏరియా అధ్యక్షుడు డి.నిఖిల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కామారెడ్డిలో త్వరలో జరిగే మహాసభలకు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి సభ్యులు ప్రభాకర్, రాష్ట్ర నాయకులు రామకృష్ణ, నాయకులు పృథ్వి, అనిల్ హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వివేక్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను మోసం చేసిన కాంగ్రెస్..




**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నిజాంసాగర్‌లో గురువారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసగించిందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి కేవలం 17 శాతం మాత్రమే ఇచ్చిందన్నారు. బీసీలంతా కాంగ్రెస్ పార్టీని ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం అచ్చంపేట గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి హన్మంత్ షిండే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన వెంట నాయకులు దుర్గారెడ్డి, నరసింహారెడ్డి తదితరులున్నారు.

## అనారోగ్యంతో యువతి బలవన్మరణం



**అక్షరటుడే, మెండోరా :** ఆరోగ్య సమస్యలతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మెండోరా మండలంలోని వెల్గటూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సుహాసిని తెలిపిన వివరాల ప్రకారం.. వెల్గటూర్ గ్రామానికి చెందిన రెడ్డి అనూష (25) మానసిక సమస్యలు, తీవ్ర తలనొప్పి, చర్మ వ్యాధితో బాధపడుతోంది. ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నప్పటికీ జబ్బు నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి అన్న అర్వింద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మెండోరా ఎస్సై సుహాసిని తెలిపారు.